క్లుప్తంగా

తపాలా సేవలపై అవగాహన



మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రఘురామచార్యులు అధ్యక్షతన జీవన నైపుణ్యాలు – తంతి తపాలా సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సుకన్యయోజన, పోస్టల్ ఇన్సూరెన్స్, పొదుపు ఖాతాల్లో రికరింగ్ డిపాజిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొదుపుతో విద్యార్థులకు ఆర్థిక భద్రత కలుగుతుందని చెప్పారు.నమ్మకమైన వ్యక్తులతో మాత్రమే మీ భావాలను పంచుకోవాలని, జీవన నైపుణ్యాలు పొందించుకోవడానికి ఒత్తిడికి గురిచేసే అంశాలను దూరంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సుజాత, నరేష్ అబ్దుల్, మత్తయ్య, కేశవయ్య, తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

కూలీలకు ఉపయోగపడే పనులనే ఎంపిక చేయాలి

నందికొట్కూరు: కూలీలకు ఉపయోగపడే పనులను గుర్తించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరరావు, ఫక్కీర్‌సాహెబ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ నాగేంద్ర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. రైతుల భూముల్లో గులకరాళ్లు, కంపచెట్లు, బండరాళ్లు తొలగించేందుకు నిధులు కేటాయించారన్నారు. 10 ఎకరాల వరకు ఉద్యానవన పంటల సాగుకు అవకాశం కల్పించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలన్నారు. సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, జయరాణి, నాగన్న, ఆంజనేయులు, బాబు ఉన్నారు.

25న యాదవుల ఆత్మీయ సమావేశం

ఆత్మకూరు: పట్టణంలో ఈనెల 25వ తేదీన యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు అఖిలభారత యాదవ మహాసభ నాయకులు శివరామకృష్ణ యాదవ్, బాలస్వామి యాదవ్, రఘురాముడు యాదవ్, వెంకటరమణ యాదవ్ తెలిపారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలో సమావేశానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ యాదవుల ఐక్యతకు, సమస్యల పరిష్కారం కోసం సమావేశాలు దోహదపడుతాయన్నారు. రాయలసీమ జోన్‌కు చెందిన నంద్యాల జిల్లా అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో స్థానిక థెరిస్సా జూనియర్ కాలేజీలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి నియోజకవర్గంలోని యాదవులంతా విరివిగా తరలిరావాలని కోరారు.

అలరించిన నాట్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్య కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన స్వాతి వారి భరతనాట్య ప్రదర్శన అలరించింది. వినాయక కవచం, మూషికవాహన, నమో నమో నటరాజ, హర హర శంభూ, భో శంభో, శివపంచాక్షరీస్తోత్రం తదితర గీతాలకు, స్తోత్రాలకు సౌమ్య, హర్షిణి, అనన్య, సంజన, గీతిక తదితరులు నృత్యం చేశారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందన



నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న డిపో మేనేజర్ మహేంద్రుడు

ఆత్మకూరు: ఆత్మకూరు ఆర్టీసీ డిపో ఆవరణలో బుధవారం ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభను డిపో మేనేజర్ మహేంద్రుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. జూలైలో అత్యధిక ఆదాయం తెచ్చిన కండెక్టర్లు జి.ఆర్.ఎల్.రెడ్డి, బి.ఆర్.వాణి, జి.సి.నాగమ్మ, ఎస్.షఫీవుల్లా, ఈ.ఎస్.లక్ష్మి, ఎస్.ఎన్.బాషా, కె.గోవిందయ్య, ఎస్.ముర్తూజాబీ, ఎం.ఆర్.శేఖర్, జి.ఎస్.వాసులు, చాక్‌మోహన్‌లను సన్మానించారు. అలాగే అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు పి.దర్గయ్య, సి.శివారెడ్డి, పీఆర్‌సీ రెడ్డి, ఎస్.కె.వలి, పి.రహంతుల్లా, ఎ.ఓబులేష్‌లకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

24న ఎస్‌ఎంసీ చెర్మన్ ఎన్నిక

పగిడ్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ యాజమాన్య చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక ఈనెల 24వ తేదిన ఉంటుందని మండల విద్యాధికారి సుభాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరై చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవాలన్నారు.

రహదారిని పూర్తి చేయండి

నంద్యాల(అర్బన్): మహానంది మండలం అబ్బీపురం గిరిజన కాలనీ రహదారిని త్వరగా పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, కార్యదర్శి రంగనాయుడు కోరారు. బుధవారం అబ్బీపురం గిరిజన కాలనీ రహదారి నిర్మాణాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ సీపీఐ చేసిన ఆందోళనల ఫలితంగా అధికారులు తూతూ మంత్రంగా మట్టిరోడ్డు వేశారని, వర్షా కాలంలో రోడ్డుపై నడిచేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు.నాయకులు బాబాఫకృద్దీన్, సామేలు, సోమన్న, సంజీవులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉచిత 'ప్రయాణం' ఉత్తిదేనా?

- మూడునెలలు అవుతున్నా అమలుకు నోచుకోని సూపర్ సిక్స్ హామీలు
- ఆర్టీసీ ఉచిత ప్రయాణం హామీ ఊసెత్తని టీడీపీ పెద్దలు
- బాబు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారా?
- అనుమానం వ్యక్తం చేస్తున్న మహిళలు

గద్దెనెక్కడమే లక్ష్యంగా టీడీపీ సూపర్ సిక్స్ హామీలు గుప్పించింది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం... రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు.... ప్రతి ఇంటికీ ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు... ప్రతి మహిళకు నెలకు రూ. 1,500, యువతకు నిరుద్యోగ భృతి రూ. 3,000... స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ. 15,000 అంటూ ఆరు సూపర్ హామీలు గుప్పించారు టీడీపీ కూటమి పెద్దలు. సీఎం కుర్చీనెక్కిన చంద్రబాబు ఇప్పటి వరకు ఒక్క హామీని అమలు చేయలేదు కదా... కనీసం ఎప్పటి నుంచి అనే స్పష్టత కరువైంది. త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం అంటూ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రకటించగా... ఇంకో అమాత్యుడు నారా లోకేష్ రోడ్డు మ్యాప్ వేసి వచ్చే ఏడాది నుంచి పథకాల అమలుపై దృష్టి సారిద్దామన్నారు. ఏకంగా సీఎం చంద్రబాబే హామీలు చూస్తుంటే భయమేస్తుందంటూ వ్యాఖ్యానించిన తీరుపై అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ యేడు ఉచిత ప్రయాణం లేనట్లేనా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు మహిళలు. – పాములపాడు



టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్ పథకాలలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒకటి. ఎన్నికల ముందు మహిళలు ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయొచ్చంటూ విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు టీడీపీ కూటమి పెద్దలు. గద్దెనెక్కి మూడు నెలలు కావస్తున్నా కనీసం హామీల అమలు ఊసెత్తని తీరును మహిళలు తప్పుపడుతున్నారు. ఉచిత ప్రయాణం ఇంకెప్పుడు అని ప్రశ్నిస్తున్నారు మహిళలు. ఆంధ్రప్రదేశ్ కంటే ముందుగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించి అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో వెంటనే ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేసింది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూడా అదే ఫార్ములాను ఫాలో అయ్యి జోరుగా ప్రచారం చేసుకుని విజయం సాధించింది. అయితే ఉచిత ప్రయాణం నేటికి కార్యరూపం దాల్చలేదు. చంద్రబాబునాయుడు ఉచిత ప్రయాణం అని మభ్య పెడుతున్నారా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు మహిళలు.

నందికొట్కూరు నియోజకవర్గంలో 1,10,418 మంది మహిళలు

నందికొట్కూరు నియోజకవర్గంలో 18 సంవత్సరాలుపై బడిన మహిళలు 1,10,418 మంది ఉన్నారు. నందికొట్కూరు మండలం – 33,130 మంది, జూపాడుబంగ్లా – 15,164, కొత్తపల్లి – 12,164, పగిడ్యాల – 13,807, పాములపాడు – 17,178, మిడుతూరు – 18,371 మంది మహిళలు ఉన్నారు. నియోజకర్గంలో మహిళా ఓటర్లు పురుషుల కంటే ఎక్కువగా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి. అందుకోసమే మహిళా ఓటర్లను ఆకర్షించేందుకే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని హామీలు గుప్పించారా? అనే సందేహాలు మొదలయ్యాయి. జిల్లా కేంద్రాలైన కర్నూలు, నంద్యాలకు నందికొట్కూరు, ఆత్మకూరు ఏపీఎస్ ఆర్టీసీ డిపో నుంచి ప్రతి రోజు 63 సర్వీసులు నడుస్తున్నాయి. ప్రతి రోజు సగటున 30శాతం మంది మహిళలు బస్సుల్లో ప్రయాణాలు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆత్మకూరు డిపోకు రూ.10 లక్షలు, నందికొట్కూరు డిపోకు రూ.8.50 లక్షల చొప్పున ఆదాయం వస్తోందని అధికారుల ద్వారా తెలుస్తోంది.

త్వరలోనే అంటున్న... రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై సీఎం చంద్రబాబు నాయుడు కనీస స్పష్టత ఇవ్వడం లేదు. సాక్షాత్తూ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాత్రం త్వరలోనే అని చెప్పడమే తప్పా... ఎప్పటి నుంచి అనే విషయంపై స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం. ఆగష్టు 15 నుంచి అనే వదంతులు సోషల్ మీడియాలో హల్ చల్ చేసిన విషయం అందరికి తెలిసిందే. పంద్రాగస్టు రోజు కనీసం ఎప్పటి నుంచి అనే విషయంపై స్పష్టత వస్తాదని ఎంతో ఆశపడిన మహిళలకు నిరాశే మిగిలింది. దీనికి తోడు అన్నట్లుగా ఏకంగా సీఎం చంద్రబాబునాయుడు సైతం సూపర్‌సిక్స్ హామీలైతే ఇచ్చాం... కాని ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే భయమేస్తోందని వ్యాఖ్యానించడం మహిళల అనుమానాలకు బలం చేకూరాయి. ఇక విద్యాశాఖ అమాత్యుడు నారాలోకేష్ రోడ్డు మ్యాప్ వేసి వచ్చే ఏడాది నుంచి పథకాల అమలుపై దృష్టి సారిద్దామన్న పలుకులపై అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది ఉచిత ప్రయాణం ఉత్తిదేనా అని చర్చించుకున్నారు మహిళలు.

చంద్రన్నా....ఉచిత ప్రయాణం ఎప్పడన్నా



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదు. ప్రక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసింది కదా. ఇక్కడెందుకు అమలు చేయలేకపోతున్నారు. ఇదేం పద్ధతి. సూపర్ సిక్స్ హామీలు అన్నీ అమలు చేయాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంపై సమాధానం చెప్పాలి.
–మల్లికాబాయి, కృష్ణానగర్, పాములపాడు మండలం

టీడీపీ పెద్దల తీరు బాగోలేదు



ఎన్నికల ముందు హామీలిచ్చేటప్పుడే ఆచరణకు సాధ్యామా అసాధ్యమా అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి పీఠంలో కుర్చోని ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తోందని అంటే ఎలా. టీడీపీ నాయకులు ఆ రోజు ఇంటింటికి వచ్చి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పారు. ఇప్పుడేమో ఇంతవరకు అతీగతీ లేదు. – పద్మావతమ్మ, పి.లింగాపురం, జూపాడుబంగ్లా మండలం

చంద్రబాబును నమ్మి ఓటెయ్యడమే తప్ప



చంద్రబాబునాయుడు మాటలు నమ్మి ఓటెయ్యడమే తప్పు. ఇప్పుడు ఆలోచించి ఏం లాభం. ఈ రోజు వరకు ఒక్క పథకమైనా అమలు చేశారా. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం భ్రమనే అనుకోవాలేమో అనిపిస్తుంది. సంక్షేమ పథకాలు మనకందాలంటే ఎదురుచూస్తూ ఉండాలంతే. మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. – వసంతమ్మ, పగిడ్యాల

పంట నమోదుతో అనేక ప్రయోజనాలు



తాటిపాడులో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ

జూపాడుబంగ్లా: ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంటనమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని తాటిపాడు గ్రామంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ అబ్దుల్ అలీం బాషా చేస్తున్న పంటనమోదు ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. రైతులతో మాట్లాడుతూ.. పంట నమోదు చేయడం వల్ల పండించిన పంటకు గిట్టుబాటు ధర, పంట దెబ్బతింటే నష్టపరిహారం, బీమా, రుణాలు తదితర ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. ప్రస్తుతం మండలం వ్యాప్తంగా 25 శాతం పంట నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన రైతులు కూడా త్వరగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

గ్రామ సభల నిర్వహణపై సమీక్ష

పగిడ్యాల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ వెంకటరమణ గ్రామ సభల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. 23వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు జరగనున్నాయని తెలిపారు. గ్రామసభలపై పంచాయతీ కార్యదర్శులు దండోరా వేయించాలన్నారు.

కొత్తపల్లి: అధికారుల సమన్వయంతో ఈనెల 23వ తేదీ జరిగే గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, ఏపీఓ రేష్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాములపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించే పనులను ప్రజలకు తెలియజేయాలని ఎంపీడీఓ గోపీక్రిష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

23 నుంచి గ్రామసభలు

ఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 23వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామసభలో సర్పంచుతో పాటు వార్డు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొనాలన్నారు.

బంద్ ప్రశాంతం



నందికొట్కూరులో నిరసన తెలుపుతున్న మాలలు

ఆత్మకూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పట్టణంలో బుధవారం నిర్వహించిన భారత్ బంద్ విజయవంతమయ్యింది. మాలమహానాడు జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో స్థానిక ఆత్మకూరు అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గౌడ్ సెంటర్‌లో మానవహారంగా నిలబడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు మురహరి మల్లయ్య, శీలం శేషు, మల్లె ఎలీషా, వెలుగోడు సర్పంచ్ జయపాల్, కరివేన సర్పంచ్ జయన్న పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు నిరసనగా బుధవారం శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో మాలమహానాడు కార్యకర్తలు ఆందోళన చేశారు. మండల మాలమహానాడు కార్యకర్తలు శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బక్కన్న, రవి కుమార్, గాలెయ్య, శేషయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు తాలుకా నాయకులు నగేష్, శివప్రసాద్ అన్నారు.



ఆత్మకూరులో నినాదాలు చేస్తున్న నాయకులు


బుధవారం పట్టణంలోని కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమాలు మాలలు చేపట్టారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు డాక్టర్ రాజు, ఎర్రన్న, రమణ, ఫ్రాన్సిస్, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ, కలకతాలో జూనియర్ డాక్టర్ పై హత్యాచారం, రైతుల నల్ల చట్టాలను వ్యతిరేకిస్తూ బుధవారం చేపట్టిన భారత్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. మాల మహానాడు నాయకులు కర్నూలు– గుంటూరు ప్రధాన రహదారి పై బైఠాయించారు. సంఘం రాయలసీమ అధ్యక్షుడు అబ్రహాం, జిల్లా అధ్యక్షుడు అంకన్న, నాయకులు రాజు, నాగరాజు, శ్రీకాంత్, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు శివలింగం, స్వామిదాసు తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: భారత్ బంద్‌లో భాగంగా బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు పెరుమాళ్ల సుధాకర్, కొల్ల మోషే, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఎస్సీవర్గీకరణ హేయమైన చర్యఅని మాల మహనాడు మండల నాయకులు సగినెల సురేష్, సతీష్‌లు అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా భారత్ బంద్ నిర్వహించారు. చిన్ని, మల్లికార్జున, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీసీహెచ్‌ఎస్ జఫ్రూల్లా

నందికొట్కూరు/మిడుతూరు: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా డాక్టర్లు, వైద్య సిబ్బంది పని చేయాలని నంద్యాల డీసీహెచ్‌ఎస్ జఫ్రూల్లా అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల వార్డులు, పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కాన్పులు అయిన మహిళలతో వైద్య సేవలు, సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో 24 గంటలు వైద్య సేవలు ఉండాలన్నారు. మిడుతూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. ఆయన వెంట నందికొట్కూరు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంబాబు, హెడ్ నర్సు భువనేశ్వరి మిడుతూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తిరుపతి, డాక్టర్ శారద, డాక్టర్ భరత్, తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన

జూపాడుబంగ్లా: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక వైద్యాధికారి గంగాధర్ అన్నారు. బుధవారం జూపాడుబంగ్లా కస్తూర్బా పాఠశాలలో ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, నివారణ మార్గాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శారీరక సంబంధం, వ్యాధిగ్రస్తుల రక్తాన్ని మరొకరికి ఎక్కించడం ద్వారా వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. అంతే తప్పా ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులతో తిరిగినా.. వారి బట్టలు ధరించినా వ్యాధి సంక్రమించదని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి గంగాధర్

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను చులకనగా చూడడం సరికాదన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే ఎక్టో 2017 ఏఆర్‌టీ మందులు వైద్యుల సూచనలు, సలహాల మేరకు వాడడం వల్ల వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్లు విజయలక్ష్మమ్మ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

జూపాడుబంగ్లా: మృతదేహాల అంత్యక్రియలకు స్థలం కేటాయించాలని బుధవారం 80బన్నూరు గ్రామస్తులు తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌ను కోరారు. దళితుల శ్మశానవాటిక స్థలం నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో పోయిందని, ఆరు మాసాలుగా అంత్యక్రియలు నిర్వహించుకొనేందుకు స్థలం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈనెల 12న దళితులకు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ కర్నూలు–గుంటూరు రహదారిపై గ్రామానికి చెందిన దళితులు రాస్తారోకో నిర్వహించగా తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ వారం రోజుల్లోగా శ్మశానానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం గ్రామానికి చెందిన ఏసన్న వయోభారంతో మృతి చెందాడు. మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలం చూపించాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌ను కలిసి వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు, మూడు రోజుల్లో పరిష్కరిస్తామని, ప్రస్తుతానికి పాత శ్మశానవాటికలోనే అంత్యక్రియలు నిర్వహించుకోవాలని సూచించారు.



తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌తో మాట్లాడుతున్న బన్నూరు దళితులు

శ్రీశైలంలో వర్ష బీభత్సం

- మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం
- రాత్రి 10 నుంచి ఉదయం 3 దాకా ఏకధాటిగా వాన
- కాలనీలు జలమయం
- విరిగిపడిన కొండ చరియలు

శ్రీశైలం : శ్రీశైల మహా క్షేత్రంలో మంగళవారం అర్ధరాత్రి భయానక వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ధాటికి ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, ఎస్టీ కాలనీ, శ్రీగిరి కాలనీ, కొత్తపేట, పురవీధులలో వర్షపు నీరు ఏరులై పారింది. కొత్తపేట, ఇతర కాలనీలో ఉన్న ఇళ్లలోకి నీరు ప్రవేశించింది. సుమారు 10 గంటల సమయంలో వర్షం నెమ్మదిగా ప్రారంభమై అర్ధరాత్రి భారీగా తెల్లవారు జామున 3 గంటల వరకు పడంది. వర్షపు నీరు మోకాళ్ల లోతు పాతాళగంగ మెట్ల మార్గం నుంచి దూకుతూ కనిపించాయి. అటవీ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు సైతం క్షేత్ర పురవీధులు, ఆయా కాలనీల నుంచి ప్రవహించడంతో శ్రీశైలం అంతా నీటితో నిండిపోయింది. దేవస్థానం అతిథిగృహమైన మల్లికార్జున సదన్‌లో ఏర్పాటు చేసిన కెనరా బ్యాంకులోకి నీరు ప్రవేశించింది. ఉదయం షెటర్లు తెరవగానే వర్షపు నీటితో నిండిన బ్యాంకును చూసి సిబ్బంది నిర్ఘాంతపోయారు. వెంటనే బ్యాంకులో ఉన్న నీటిని తొలగించే ప్రక్రియను ప్రారంభించారు.



పురవీధుల్లో ప్రవహిస్తున్న వర్షపు నీరు



కెనరాబ్యాంకులో చేరిన వర్షపు నీటిని తోడుతున్న సిబ్బంది

మంగళవారం రాత్రి 138 మి.మీ (13.8 సెం.మీ) వర్షపాతం నమోదైనట్లు శ్రీశైలం మండల తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

వర్షం ధాటికి విరిగిపడ్డ కొండరాళ్లు...

మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షం ధాటికి శ్రీశైలం–లింగాలగట్టు, మననూరు ఘాట్లలో కొండపై ఉన్న రాళ్లు విరిగిపడ్డాయి. అర్ధరాత్రి సమయంలో ఘాట్ రోడ్డులో రాకపోకలు లేకపోవడం వల్ల వాహనాలకు ప్రమాదం తప్పింది.



గంగాభవాని స్నాన ఘట్టాల వద్ద మెట్లపై నుంచి ప్రవహిస్తున్న నీరు



వర్షం ధాటికి విరిగిపడ్డ కొండరాళ్లు

చట్టాన్ని వ్యతిరేకిస్తే చర్యలు తప్పవు



ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకుంటున్న తిరుపాలు

నందికొట్కూరు: ప్రజలు చట్టాన్ని వ్యతిరేకిస్తే కఠిన చర్యలు తప్పవని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ ఎస్‌ఐ తిరుపాలు హెచ్చరించారు. బుధవార మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టానికి, న్యాయానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

వృద్ధుడి అదృశ్యం



మదార్‌సాహెబ్

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలో వృద్ధుడు అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. ఈ నెల 18న దామగట్ల గ్రామానికి చెందిన మదార్‌సాహెబ్(80) ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు అల్లాబక్కాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పని ఒత్తిడి తగ్గించాలి

వెలుగోడు: ప్రాథమిక పరపతి సహకార సంఘాలలో ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని కేడీసీసీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ నారాయణరెడ్డి కోరారు. బుధవారం స్థానిక బ్రాంచ్ ఆవరణలో పీఏసీఎస్ కంప్యూటరైజేషన్ విధానానికి నిరసనగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపట్టామన్నారు. ఒక రైతుకు సంబంధించి కంప్యూటరైజేషన్ చేయాలంటే చాలా సమయం తీసుకుంటుందన్నారు. ఒక్కొక్కసారి నెట్ సమస్యతో కూడా రైతుల వివరాలు నమోదు చేయలేక చేయలేకపోతున్నామన్నారు. అయినా ఉన్నత అధికారులు ఒత్తిడి చేసి వారం పది రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించడం బాధాకరమన్నారు. నిరసన కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఆయా సొసైటీల సీఈఓలు జంబులయ్య, గోపాల్, కృష్ణ మోహన్, ముర్తుజావలి, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు ఆపాలి

కొత్తపల్లి: ఎప్పుడు పడితే అప్పుడు అప్రకటిత విద్యుత్ కోతలు విధించడం ఆపాలని సీపీఎం మండల నాయకులు స్వాములు, సంజీవ రాయుడు, ఏసన్నలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని సింగరాజుపల్లె గ్రామంలో విలేకరులతో వారు మాట్లాడారు. ఎప్పుడు కరెంట్ వస్తుందో అని పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద రైతన్నలు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో కరెంట్ కోతలు విధించడం దారుణమని, ప్రజలు నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

వెలుగోడు: మండల పరిధిలోని బోయ రేవుల గ్రామంలో నిరుపేదలకు ఈ ఆర్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. బుధవారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రేవరాండం స్టేట్ కమిటీ సెక్రటరీ జాన్ హాజరై మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అనేక జిల్లాలలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి ఏడాది ట్రస్ట్ ఆధ్వర్యంలో చర్చి ఫాదర్‌ల ద్వారా నిరుపేదలను గుర్తించి సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏస్తేర్ రాణి, షారోన్ రతన్ రాజు, ఏసు రత్నం, మండల అధ్యక్షుడు అన్నారపు శేషి రెడ్డి పాల్గొన్నారు.

సత్రాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి



సత్రాల నిర్వాహకులకు పలు ఆదేశాలు జారీ చేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: క్షేత్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా క్షేత్ర పరిధిలోని ఆయా సత్రాలలో బస చేసే భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు సత్రాల నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం దేవస్థాన పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో సత్రాల నిర్వాహకులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి సంత్రంలో ప్రతి గదిలో విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు ఎలక్ట్రికల్ వైరింగ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.